# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :141 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: గురువారం 07-08-2025 పేజీలు:4 వెల: 2.00


### కొండగట్టులో భారీగా భక్తుల రాక

జగిత్యాల,అంజన్న పుణ్య క్షేత్రం కొండగట్టులో భక్తుల రద్దీ కారణంగా అన్నదానం టోకెన్ల కోసం కొట్లాట జరిగింది. కొండగట్టు- ఆంజనేయ స్వామి సన్నిధికి భక్తులు భారీగా తరలివెళ్లారు. మంగళవారం పైగా శ్రావణ మాసం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున గుట్టకు చేరుకొని అంజన్నకు మొక్కలు చెల్లించుకున్నారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. సూపరిండెంట్లు- సునీల్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు- చేశారు. నిత్యం అన్నదానం చేసే సత్రం దగ్గర టోకెన్ల కోసం భక్తులు ఎక్కువ మంది రావడంతో స్వల్ప తోపులాట జరిగింది. కేవలం 200 మంది భక్తులకు అన్నదానం అవకాశం కల్పించడంతో సుమారు 300 పైగా భక్తులు చేరుకున్నారు. దీంతో టోకెన్ల జారీ చేసే దగ్గర స్వల్ప తోపులాట జరిగింది. అన్నదానం టోకెన్ల సంఖ్యను పెంచాలని ఈ సందర్భంగా భక్తులు డిమాండ్ చేశారు. నిత్యం భక్తులతో కిటకిటకిటలాడే కొండగట్టు- అంజన్న ఆలయం ఆషాడ మాసంలో భక్తులు లేక వెలవెల పోయింది. ప్రస్తుతం శ్రావణ మాసం కావడంతో అంజన్న దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు.

## ప్రజలను భ్రమ పెట్టేందుకే ఢిల్లీలో ధర్నాలు



హైదరాబాద్,ఆగస్టు6: బీసీల రిజర్వేషన్ల బిల్లు కోసం ప్రజలను భ్రమ పెట్టేందుకే ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా పేరుతో నాటకాలు ఆడుతుందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. సామాజిక తెలంగాణ అంటే ఢిల్లీకి వెళ్లి వట్టిగా ధర్నాలు చేయడం కాదని విమర్శలు చేశారు. బుధవారం తెలంగాణ జాగృతి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో జాగృతి జెండాను కవిత ఆవిష్కరించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు ఇచ్చే 42 శాతం రిజర్వేషన్‌లో ముస్లింలు ఉండవద్దని ముందు నుంచి బండి సంజయ్ మాట్లాడుతునే ఉన్నారని చెప్పుకొచ్చారు. బీజేపీ బీసీలను మోసం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ప్రతి ఒక్క పార్టీతో జై తెలంగాణ అనిపించామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అని ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు. బీసీల కోసం తాము హైదరాబాద్‌లో 72గంటల పాటు దీక్ష చేశామని ఉద్ఘాటించారు. కోర్టు నుంచి తమకు పర్మిషన్ రాలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో దొంగ దీక్షలు చేయడం కాదని, నిజమైన దీక్షలు చేయాలని హితవు పలికారు ఎమ్మెల్సీ కవిత. జాగృతిలోకి వచ్చేందుకు చాలామంది రెడీగా ఉన్నారని.. తమకు అన్నివర్గాల మద్దతు వస్తోందని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. బీసీల కోసం కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు చిత్తశుద్ధితో పని చేయటం లేదని మండిపడ్డారు. బీసీల కోసం జాగృతి కార్యచరణ సిద్ధం చేస్తుందని ప్రకటించారు. ముస్లిం రిజర్వేషన్లపై బండి సంజయ్ మాట్లాడకపోతేనే విచిత్రమని ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్‌లపై కాంగ్రెస్ ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని, అన్ని పార్టీల నాయకులకు లేఖలు రాయాలని సూచించారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ తీసుకొని, అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకొని వెళ్లాలనీ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ చెప్పినట్లుగా, వారి బాటలో తెలంగాణ జాగృతి ముందుకు వెళ్లిందని ఉద్ఘాటించారు. జయశంకర్ సార్ ఆలోచనలను తూచా తప్పకుండా పాటించామని చెప్పుకొచ్చారు. తెలంగాణ చూడకుండానే జయ శంకర్ సార్ దూరం అయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. జయ శంకర్ సార్ జయంతి సందర్భంగా జాగృతి ఫౌండేషన్ డే జరుపుకుంటున్నామని తెలిపారు. సామాజిక తెలంగాణ కోసం పాటుపడాలని జయశంకర్ సార్ అనేక సార్లు చెప్పారని గుర్తుచేసుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్నివర్గాల వారికి సమన్యాయం జరగాలని జయశంకర్ సార్ చెప్పే వారని పేర్కొన్నారు.

## సీఎం రేవంత్‌పై మరోసారి రాజగోపాల్ రెడ్డి హాట్ కామెంట్స్!



హైదరాబాద్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై మరోసారి కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. సీఎం ప్రతిపక్షాలను తిట్టడం మానేసి ప్రభుత్వం ఏం చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు.సోషల్ మీడియా విషయంలో ఓడ దాటే వరకు ఓడ మల్లన్న.. ఓడ దాటిన తర్వాత బోడ మల్లన్న అన్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ తన భాష మార్చుకోవాలని సూచించారు. మరో మూడున్నరేళ్లు రేవంత్ రెడ్డే సీఎం అని, ఆ తర్వాత ఎవరు అనేది అప్పుడు చూద్దామన్నారు. తనకు మంత్రి పదవి విషయంలో హైకమాండ్ ప్రామిస్ చేసిందని మరోసారి రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు.ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 'సీఎం రేవంత్ రెడ్డి తన భాష మార్చుకోవాలి. ప్రతిపక్షాలను తిట్టడం మానేసి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజలకు చెప్పాలి. 20 మంది సీమాంధ్ర కాంట్రాక్టర్లు తెలంగాణను దోచుకుంటున్నారు. నాకు మంత్రి పదవి విషయంలో హైకమాండ్ ప్రామిస్ చేసింది. నా మంత్రి పదవి విషయం కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి తెలియదు. ఇంకా మూడున్నరేళ్లు రేవంత్ రెడ్డే ముఖ్యమంత్రి. ఆ తర్వాత ఎవరు అనేది అప్పుడు చూద్దాం. అందరం కలిస్తేనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది' అని చెప్పారు.'సోషల్ మీడియా విషయంలో ఓడ దాటే వరకు ఓడ మల్లన్న.. ఓడ దాటిన తర్వాత బోడ మల్లన్న అన్నట్లు ఉంది సీఎం రేవంత్ రెడ్డి వైఖరి. నాకు మంత్రి పదవే కావాలంటే అప్పుడే కేసీఆర్ ఇచ్చేవారు. అధికారం కోల్పోయిన ఫ్రస్టేషన్‌లో బీఆర్ఎస్ ఉంది. అసెంబ్లీకి రాని కేసీఆర్.. ముందుగా తన ప్రతిపక్ష హోదా పదవికి రాజీనామా చేయాలి. సీఎం రేవంత్ రెడ్డి కమిషన్ల పేరుతో కాలయాపన చేస్తున్నారు. కాళేశ్వరం అవినీతిపై కఠిన చర్యలు తీసుకోవాలి. బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోలేదు' అని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా జర్నలిస్టులపై మండిపడ్డారు. ఆ విషయంలోనే ఇప్పటికే ట్విట్టర్ వేదికగా కౌంటర్ ఇచ్చిన మునుగోడు ఎమ్మెల్యే.. తాజాగా మరోసారి టార్గెట్ చేశారు.

## తెలంగాణ రాష్ట్ర సాధనే ఊపిరిగా బతికిన జయశంకర్‌సార్



హైదరాబాద్,ఆగస్టు6: జీవితాంతం తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా, ఏకైక ఎజెండాగా బతికిన మహనీయుడు జయశంకర్ సార్ అని మాజీ మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. ఆయన తెలంగాణ రాష్ట్ర సాధనకు చేసిన కృషి ఎప్పటికీ వెలకట్టలేమని పేర్కొన్నారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షకు ప్రతీక, తెలంగాణ ముద్దుబిడ్డ, సిద్ధాంత కర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. భవిష్యత్ తరాలకు జయశంకర్ స్ఫూర్తిని అందించాలనే ఉద్దేశంతో వారి జీవిత విశేషాలను పాఠ్యపుస్తకాల్లో మాజీ సీఎం కేసీఆర్ చేర్పించారని గుర్తుచేశారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ, భూపాలపల్లి జిల్లాలకు వారి పేరు పెట్టడంతో పాటు, ఏటా ఆయన జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించేలా నిర్ణయించారని తెలిపారు. జయశంకర్ సార్.. ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని వారి మార్గంలో పయనించడమే వారికి మనమిచ్చే నిజమైన నివాళి అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

మహిళా ప్రతినిధి పట్ల పోలీసు చర్యలు బాధాకరం : హరీశ్‌రావు

కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు రోజురోజుకు దిగజారిపోతున్నాయని, మొట్టమొదటి మహిళా హోంమంత్రి, సీనియర్ శాసన సభ్యురాలు అయిన సబితా ఇంద్రారెడ్డి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటూ మహిళా సభ్యురాలి పట్ల ఇంత కర్కశంగా, అవమానకరంగా వ్యవహరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వాన్ని నిలదీయడమే సబిత చేసిన తప్పా? మంత్రి సమక్షంలోనే కాంగ్రెస్ నాయకులు వీధి రౌడీలుగా బెదిరింపులకు పాల్పడుతుంటే అడ్డుకోవాల్సిన పోలీసులు వారితో కలిసి మహిళా ఎమ్మెల్యేపై దౌర్జన్యానికి పాల్పడడం దుర్మార్గమన్నారు. సబితపై అనుచితంగా, అమర్యాదగా ప్రవర్తించిన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. హోంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని కోరారు.

## కర్తవ్య భవన్-3ను ప్రారంభించిన ప్రధాని మోదీ..!

న్యూఢిల్లీ, దేశ రాజధాని న్యూఢిల్లీలో అధికార పరిపాలనకు మౌలిక భద్రతను అందించేందుకు రూపొందించిన కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణాల్లో ఒక్కటైన కర్తవ్య భవన్-3ను ప్రధాని నరేంద్ర మోదీ నేడు (ఆగష్టు 6) అధికారికంగా ప్రారంభించారు.ఇది మొత్తంగా 10 భవనాల సముదాయ నిర్మాణం. ప్రస్తుతం ఢిల్లీలో విస్తరించి ఉన్న గృహ, విదేశాంగ, గ్రామీణాభివృద్ధి, సూక్ష్మ లఘు మధ్య పరిశ్రమలు (MSME), డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (DoPT), పెట్రోలియం, న్యాచురల్ గ్యాస్, ప్రిన్సిపాల్ సైంటిఫిక్ అడ్వైజర్ (PSA) వంటి శాఖల కార్యాలయాలు ఇక కర్తవ్య భవన్-3లో ఒకేచోట పనిచేయనున్నాయి. ఈ సెంట్రలైజ్డ్ భవనం ఆధునిక వసతులు, సామర్థ్యం, సహకార వాతావరణాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా డిజైన్ చేయబడింది.ఈ నేపథ్యంలో నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్‌లలో ఉన్న శాఖలను కొత్త భవనాలకు తరలించి.. ఆ ఐకానిక్ భవనాలను ఇండియన్ మిథాలజీ, ఆధునిక చరిత్రను ప్రతిబింబించే మ్యూజియాలుగా అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. 1950 - 1970ల మధ్య నిర్మించిన శాస్త్రి భవన్, కృషి భవన్, ఉద్యోగ్ భవన్ మరియు నిర్మాణ్ భవన్ వంటి పాత భవనాల నుండి ప్రస్తుతం అనేక కీలకమైన కేంద్ర మంత్రిత్వ శాఖలు పనిచేస్తున్నాయి. అయితే ప్రభుత్వం ప్రకారం ఈ నిర్మాణాలు ఇప్పుడు నిర్మాణాత్మకంగా పాతవిగా పరిగణించబడుతున్నాయి.కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ విస్టా పునర్నిర్మాణ ప్రాజెక్ట్ లో భాగంగా పది కొత్త భవనాల నిర్మాణం



చేపట్టారు. ఇందులో 2, 3 భవనాలు ఇప్పటికే నిర్మాణంలో ఉండగా, అక్టోబర్ 2026 నాటికి 6, 7 భవనాలు పూర్తి కానున్నాయి. ఈ నేపథ్యంలో శాస్త్రి భవన్, కృషి భవన్ మొదలైన పాత భవనాల్లో పనిచేస్తున్న శాఖలను కస్తూర్బాగాంధీ మార్గ్, మింటో రోడ్, నేతాజీ ప్యాలెస్ వంటి నూతన ప్రదేశాలకు తాత్కాలికంగా రెండు సంవత్సరాల పాటు తరలించనున్నట్లు మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. పునర్నిర్మాణ ప్రణాళికలో నేషనల్ మ్యూజియం, నేషనల్ ఆర్కైవ్స్, జవహర్ లాల్ నెహ్రూ భవన్ (విదేశాంగ శాఖ), డాక్టర్ అంబేద్కర్ ఆడిటోరియం, వాణిజ్య భవన్ వంటి కొత్త నిర్మాణాలు యథాతథంగా ఉంచనున్నారు.

## బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ డ్రామాలు

న్యూఢిల్లీ,ఆగస్టు6: బీసీలను రిజర్వేషన్ల పేరుతో మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ పార్టీ పూనుకున్నదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం చట్టసభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేసే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అలవికాని హామీలిచ్చి తెలంగాణలో అధికారంలోకి వచ్చింది అని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక దిక్కుతోచని స్థితిలో రేవంత్ రెడ్డి మంత్రిమండలిని, పార్టీ ఎమ్మెల్యేలను, బీసీ సోదరులను వెంటబెట్టుకుని వచ్చి జంతర్ మంతర్ వద్ద డ్రామా చేస్తుండు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ధర్నాలు, డ్రామాతో ఏ మాత్రం లాభం లేదు, బీసీలకు ఒరిగేదేమీ ఉండదు అని పేర్కొన్నారు. రాజ్యాధికారంలో మా న్యాయమైన వాటా కోసం, హక్కుల సాధనకు ఇటువంటి ధర్నాలు,ఉద్యమాలు ఎన్నో చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తొలినాళ్లలోనే మహానేత కేసీఆర్ మహిళలు, బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలంటూ అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపారు. బీసీలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందంటే, సముచిత గౌరవం దక్కిందంటే అది కేసీఆర్ సుపరిపాలనలోనే అని పేర్కొన్నారు. మోసపు మాటలు చెప్పి, 432 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తుండు. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో మున్నూరు కాపు, ముస్లిం, లంబాడ, రజక, యాదవ్, కుర్మ కులాల వారికి చోటు లేకపోవడం బాధాకరం. రేవంత్



రెడ్డి ఆదరాబాదరాగా బీసీ కులాల కార్పొరేషన్స్ ఏర్పాటు చేసి ఏడాదిన్నర పూర్తయినా కూడా అణా పైస విడుదల చేయలే అని మండిపడ్డారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా, ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేయడంలో చిత్తశుద్ధి ఉంటే రాహుల్ గాంధీ పార్లమెంటులో గళమెత్తాలి, కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచాలి. లోకసభ, రాజ్యసభల్లో కలిపి కాంగ్రెస్, ఇండియా కూటమికి 300 మందికి పైగా సభ్యులు ఉన్నారు, కేంద్రాన్ని ఒప్పించి బీసీ బిల్లు పెడితే బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుంది, రిజర్వేషన్స్ కు చట్టబద్ధత లభిస్తుంది అని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.

## ఫిజిక్స్ చూసి పెళ్లిళ్లు .. కెమిస్ట్రీ బాగాలేదని విడాకులు తీసుకుంటున్నారు..



విజయవాడ:విజయవాడలో వల్లూరు శ్రీమన్నారాయణ అభినందన సభలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉండే రాజకీయాలు, రాష్ట్రంలో ఉండే పరిణామాలపై ప్రజలు ఆలోచన చేయాలి..రాజకీయ నాయకుల నడవడిక, పని తీరును ప్రజలు గమనిస్తుండాలి.. ఎప్పుడూ ఆదర్శంగా, క్రమశిక్షణతో నమ్మిన సిద్ధాంతం కోసం పని చేయాలని సూచించారు. జట్కా బండి పైన తిరిగి అద్వానీ, వాజ్ పాయ్ ప్రచారం చేసేవారు.. లా చదువుకుని, జన సంఘ్ పట్ల ఆకర్షితుడై, ఆ తరువాత బీజేపీ కోసం శ్రీమన్నారాయణ పని చేశారని గుర్తు చేశారు. ఎన్నికలలో పోటీ చేయకుండా, పదవులు ఆశించకుండా ఆయన పార్టీ కోసం పని చేశారు.. మన ప్రవర్తన చూసి మన పార్టీ పై నమ్మకం కలిగించాలి.. మన మాట, మన పని, మనం చేసే సాయమే నాయకుడిగా ఎదిగేలా చేస్తుందని వెంకయ్యనాయుడు వెల్లడించారు.అయితే, ఇప్పుడు ఎవరు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితి ఏర్పాడిందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బస్సుల రాకపోకల తరహాలో.. రాజకీయ నాయకుల రాకపోకలు అని వారి వివరాలు ప్రజలకు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో సరైనా కారణం ఉంటేనే నాయకులు పార్టీ మారేవారు.. కానీ, ఇప్పుడు డైపర్లు మార్చినంత ఈజీగా పార్టీ మారుతున్నారు అని మండిపడ్డారు. ఒక పార్టీని నమ్మితే ఆ పార్టీ కోసం పని చేసేవారే నిజమైన నాయకుడు.. రాజకీయ నాయకులకు సమయ పాలన కూడా ఎంతో ముఖ్యం అన్నారు.ఇక, నేడు వివాహ వ్యవస్థపై కూడా నమ్మకం పోతుంది అని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. మన కుటుంబ, వివాహ వ్యవస్థ చూసే ప్రపంచ దేశాలు గౌరవిస్తాయి.. ఫిజిక్స్ చూసి పెళ్లిళ్లు.. కెమిస్ట్రీ బాగాలేదని విడాకులు తీసుకుంటున్నారు ఇప్పుడు అని విమర్శించారు. ఏ పని అయినా ఇష్టపడి చేస్తే.. కష్టం అనేది ఉండదు.. ఎదుటి వారితో గౌరవ మర్యాదలు పాటిస్తే.. అదే గౌరవం మనకీ దక్కుతుంది అని తెలిపారు. ఎవరితోనైనా స్నేహం మన కనురెప్ప లాగా ఉండాలని సూచించారు. ఎప్పుడు అవసరం వచ్చినా కనురెప్ప లాగా ఆ కష్టానికి అడ్డంగా నిలబడాలని మాజీ ఉపరాష్ట్రపతి తెలియజేశారు.

## ఉగ్రముప్పు హెచ్చరికలు.. దేశంలోని అన్ని ఎయిర్‌పోర్ట్సులో హైఅలర్ట్

న్యూఢిల్లీ, దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాలకు ఉగ్రముప్పు పొంచి ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. సంఘ వ్యతిరేక శక్తులు దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించాయి. నిఘా వర్గాల హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. అన్ని ఎయిర్‌పోర్టుల్లో హైఅలర్ట్ ప్రకటించారు. సెప్టెంబర్ 22, అక్టోబర్ 2 మధ్య ఉగ్రవాద ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ దేశంలోని అన్ని విమానాశ్రయాల్లో హై అలర్ట్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని విమానాశ్రయాలు, ఎయిర్‌స్ట్రిప్‌లు, హెలిప్యాడ్‌లు, వైమానిక దళ స్థావరాలు, ఫ్లైయింగ్ స్కూల్స్ వద్ద భద్రతను పెంచాలని సూచించారు. ఈ ఆదేశాలతో విమానాశ్రయాల వద్ద భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. టెర్మినల్స్, పార్కింగ్ ఏరియా తదితర ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను పెంచారు. ఎయిర్‌పోర్టులకు వెళ్లే మార్గాల్లోనూ తనిఖీలు ముమ్మరం చేశారు. విమానాశ్రయాల వద్ద ఎమర్జెన్సీ




రెస్పాన్స్ టీమ్స్‌ను యాక్టివేట్ చేశారు. అవసరమైతే మాక్ డ్రిల్స్ నిర్వహించాలని పౌర విమానయాన భద్రతా బ్యూరో సంబంధిత అధికారులకు సూచించింది.

## కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట



హైదరాబాద్, ఆగస్టు 6: కేంద్రం హోం మంత్రి అమిత్‌షా పరువుకు భంగం కలిగించేలా వాఖ్యలు చేశారనే కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు జారా?ండ్‌లోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ గాంధీ స్వయంగా చాయిబాసా కోర్టు ముందు బుధవారంనాడు హాజరయ్యారు. దీనికి ముందు, రాహుల్ గాంధీ కోర్టుకు హాజరవుతున్న నేపథ్యంలో కోర్టు చుట్టూ భద్రతను పెంచారు. శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని స్థానిక యంత్రాంగం భద్రతా ఏర్పాట్లు చేసింది. రాంచీ నుంచి చాయిబాసాకు రాహుల్ హెలికాప్టర్‌లో వచ్చారు. ఇందుకోసం టాటా కాలేజీ గ్రౌండ్స్‌లో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు రాహుల్ మంగళవారంనాడు రాష్ట్రానికి వచ్చారు. రాహుల్ గాంధీ 2018లో జరిగిన ఒక ర్యాలీలో అమిత్‌షా పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ ప్రతాప్ కుమార్ అనే వ్యక్తి పరువునష్టం కేసు వేశారు. జూన్ 26న ప్రత్యేక కోర్టు ముందు రాహుల్ హాజరు కావాల్సి ఉండగా ఆయన తరపు న్యాయవాది తన క్లయింట్ ఆరోజు హాజరుకాలేరని, ఆగస్టు 6వ తేదీని హాజరయ్యేందుకు వీలు కల్పించాలని కోర్టును కోరారు.

# వివేకా కేసు సంగతి అంతేనా ?



హైదరాబాద్,మాజీ మంత్రి ఆయన. ఘనమైన రాజకీయ కుటుంబంలో నుంచి వచ్చిన వారు. ఆయన అన్నయ్య వైఎస్ రాజశేఖర్ రెడ్డి అత్యంత ప్రజాదరణ కలిగిన ముఖ్యమంత్రిగా జనం మెప్పు పొందారు. ఆయన అనుంగు సోదరుడిగా ఉంటూ ఎమ్మెల్యేగా ఎంపీగా ఎమ్మెల్సీగా మంత్రిగా పనిచేసిన ఆయన ఎవరో కాదు వైఎస్ వివేకానందరెడ్డి. ఆయనకు అజాత శత్రువు అని పేరు ఆయన జనంతో ఉంటూ వారి సమస్యలు తీరుస్తూ మమేకం అయిన వారు అటువంటి సౌమ్యుడు దారుణ హత్యకు గురి అయ్యారు అంటే అంతా విస్తుబోయారు.

ఆరున్నరేళ్ళుగా సాగుతూ :

వైఎస్ వివేకానందరెడ్డి 2019 మార్చి 15న దారుణ హత్యకు గురి అయ్యారు పులివెందులలో తన ఇంట్లో ఆయన హత్య గావించబడ్డారు. ఇప్పటికి ఆరున్నరేళ్ళు అయింది. ఈ హత్య కేసులో అసలైన నిందితులు ఎవరో ఇప్పటిదాకా తెలియలేదు. దీని మీద ముందు స్థానిక పోలీసులు దర్యాప్తు చేశారు. తరువాత వివేకా కుమార్తె సునీత కోరిక మేరకు కోర్టు ఈ కేసుని సీబీఐకి అప్పగించాలని సూచించింది. దాంతో సీబీఐ అనేక ఏళ్ళుగా దర్యాప్తు చేస్తోంది. అయితే ఈ కేసు అలా ఏళ్ళూ పూళ్ళూ సాగుతూనే ఉంది కానీ నిందితులు ఎవరు అన్నది మాత్రం తేలలేదు.

ఇంతలో ముగింపు మాట :

ఇదిలా ఉంటే సుప్రీం కోర్టుకు సీబీఐ ఈ కేసులో తమ విచారణ ముగిసిందని ప్రకటించింది. కోర్టు ఏదైనా ఆదేశిస్తే తాము ఆ దిశగా దర్యాప్తు చేస్తామని పేర్కొంది. తమ శాఖాపరమైన దర్యాప్తు అయితే ముగిసినట్లే అని స్పష్టం చేసింది. తెలుగు రాష్ట్రాలలో సంచలనం గా మారిన వివేకా హత్య కేసుని ప్రతిష్టాత్మకమైన దర్యాప్తు సంస్థ సీబీఐ టేకప్ చేసింది. అయితే సీబీఐ ఈ కేసులో విచారణ పూర్తి అయింది అని చెప్పడం వరకూ ఓకే కానీ ఫలితం ఏమిటి అన్నదే చర్చగా ఉంది.

ఎవరికి దోషిగా తేల్చినట్లు :

ఈ కేసు విచారణ ముగిసిందని సీబీఐ చెబుతోంది. మరి వివేకా హత్యకు పాల్పడిన వారు ఎవరు సూత్రధారులు పాత్రధారులు ఎవరు అన్నది అందరిలో ఉన్న చర్చ. మరి దానికి సీబీఐ నుంచి జవాబు వచ్చిందా అన్నదే అంతా ఆలోచిస్తున్నారు. ఈ కేసులో అసలైన నేరస్తులు ఎవరూ ఏమిటీ అన్నది తేల్చకుండానే కేసులో విచారణ అయిపోయింది అని సీబీఐ చెప్పడం మీద అయితే హాట్ డిస్కషన్ అయితే సాగుతోంది. సుప్రీం ఆదేశిస్తే విచారణ చేస్తామని చెప్పడం వెనక ఉన్న ఆంతర్యం ఏమిటి అని కూడా అంతా చర్చిస్తున్నారు.

వివరాలు చెప్పాలి కదా :

ఒక సీరియస్ కేసు ఎంతో కీలకమైన కేసులో విచారణ పూర్తి అయితే ఫలానా వారు దోషులు అని ప్రకటించాలి కదా లేదా ఫలానా కారణాల వల్ల ఈ హత్య జరిగింది అని తేటతెల్లం చేయాలి కదా అన్నది కూడా ప్రజలలో సాగుతున్న చర్చ. సీబీఐ విచారణ పరిపూర్తి అయిందని చెప్పడంతో ఈ కేసులో సీబీఐ సాధించింది ఏమిటి అన్న ప్రశ్నలు కూడా వస్తున్నాయి. ఏది ఏమైనా ఎంతో హై ప్రొఫైల్ కేసుగా ఉన్న వివేకా హత్య కేసులో సీబీఐ ఈ విధంగా చెప్పడంతో ఈ కేసులో తేల్చినది ఏమిటి అనే అనుకుంటున్నారు. చూడాలి మరి దీని మీద పురోగతి ఏమి ఉంటుందో సుప్రీంకోర్టు ఈ కేసులో సీబీఐని ఏమని ఆదేశిస్తుందో.

# అమరావతికో ఇటుక...రాజకీయ రచ్చ !

అమరావతి,ప్రపంచ రాజధాని అమరావతి అన్నది టీడీపీ స్లోగన్. ఆ పార్టీ అలాగే దానిని చూస్తూ ముందుకు చేస్తూ సాగుతోంది. అమరావతి రాజధాని కనుక పూర్తి అయితే అద్భుతాలు జరిగి ఏపీ అన్ని విధాలుగా ముందుకు సాగుతుందని కూడా కూటమి ప్రభుత్వ సారధి చంద్రబాబు భావిస్తున్నారు. అమరావతి ఒక్కటి చాలు సంపద సృష్టికి ఎంతో కీలకమవుతుందని కూడా ఆశగా ఉన్నారు.

అమరావతి చుట్టూ :

అమరావతి రాజధాని విషయంలో ఎన్ని అనుకూలతలు ప్రభుత్వం చూపిస్తోందో విపక్షాల నుంచి అన్ని రకాల విమర్శలు వస్తూనే ఉంటాయి. అమరావతిలో అవినీతి దందా నడుస్తోందని చదరపు అడుగుకు పది వేల రూపాయలు వంతున ఖర్చు చేస్తున్నారు అని జగన్ లీగల్ సెల్ మీటింగులో ఆరోపించారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరిట దోపిడికి తెర తీశారని ఫైర్ అయ్యారు. ఇక కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ అయితే అమరావతి వాస్తు బాగాలేదని అంటున్నారు. అమరావతి ఎత్తిగిల్లడం కష్టమని జోస్యం చెబుతున్నారు.

విరాళాలు అంటూ :

అమరావతి రాజధాని కోసం విరాళాలు చందాలు సేకరిస్తున్నారు అని ఇపుడు సరికొత్త వార్తా కథనాలు వస్తున్నాయి. అమరావతి కోసం నిధులు జనాలను కోరుతున్నారని ప్రచరం సాగుతోంది అమరావతి రాజధానికి నిధుల లేమి ఉందని అందుకే జనాల నుంచి విరాళాలు కోరుతున్నారని వార్తలు దట్టిస్తున్నారు దీని మీదనే ఇపుడు అతి పెద్ద చర్చ సాగుతోంది.

ప్రజా భాగస్వామ్యం కోసమే:

అప్పులు దొరకక విరాళాలు సేకరిస్తున్నారు అన్నది పచ్చి అబద్ధమని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ప్రజా భాగస్వామ్యం ఉండాలనే గతంలో మై బ్రిక్ మై అమరావతి అని ప్రారంభించామని గుర్తు చేశారు. పది రూపాయలు ప్రతీ



వారు ఇటుక కోసం విరాళాలు ఇచ్చారని చెప్పారు. ఇపుడు కూడా అదే విధానం కొనసాగుతుందని మంత్రి నారాయణ చెప్పారు అప్పులు దొరకలేదు అని అమరావతికి నిధులు లేవని చెప్పడం పూర్తిగా తప్పు అని ఆయన ఖండించారు.

మూడేళ్ళలో అమరావతి పూర్తి :

అమరావతి రాజధాని నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తామని నారాయణ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సాగుతున్న రాజధాని నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయని అంటున్నారు. అమరావతి నిర్మాణానికి సంబంధించి అన్ని పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. 2026మార్చి నెలాఖరుకు అధికారులు,ఉద్యోగులకు సంబంధించి నాలుగు వేల ఇళ్ల నిర్మాణం పూర్తిచేస్తామని తెలిపారు. కాలువలు,రిజర్వాయర్ల పనులు వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తి చేసేలా కార్యచరణతో ముందుకు సాగుతున్నామని ఆయన చెప్పారు. మొత్తానికి అమరావతి ఆల్ ఈజ్ వెల్ అని మంత్రి చెబుతూ అమరావతి మీద ఎన్ని కుట్రలు చేసినా తాము ముందుకు తీసుకుని వెళ్తామని ఆ సత్తా తమకు ఉందని అన్నారు.

# బాబు పాలన ఎందుకిలా?

అమరావతి,"చంద్రబాబు పాలన కట్టు తప్పింది. ఆయన మాట ఎవరూ వినే పరిస్థితి లేదు. అంతా ఇష్టారాజ్యంగా తయారైంది" . ఈ మాటలు అంటున్నది ప్రతిపక్ష పార్టీల నాయకులు కాదు. సొంత పార్టీ నేతలే కావడం గమనార్హం. గతంలో ఎప్పుడూ చూడని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయి. ప్రజాప్రతినిధులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, ఇష్టానుసారం దోచుకుంటున్నారు.గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర రియల్టర్లను బెంబేలెత్తించేలా కమీషన్లకు, దోపిడీలకు పాల్పడుతున్నారని టీడీపీ అనుకూల, వ్యతిరేక మీడియా వ్యతిరేక కథనాలు రాస్తోంది. అయితే ఒక్క ధూళిపాళ్ల నరేంద్రే కాదు, ఏ ప్రజాప్రతినిధి తీరు చూసినా, ఏమున్నది గర్వకారణం అనే మాటే వినిపిస్తోంది.ఆంధ్రప్రదేశ్‌లో ఏ అసెంబ్లీ నియోజకవర్గమైనా తీసుకోండి పొన్నూరు దందా కథలే జనం చెబుతారు. అనంతపురం జిల్లాలోని మారుమూల నియోజకవర్గం మొదలుకుని శ్రీకాకుళంలోని ఏ నియోజకవర్గం తీసుకున్నా, అక్కడి ఎమ్మెల్యే లేదా మంత్రి దందా గురించి విస్తుగొలిపే అంశాలు చెబుతారు. విని, తట్టుకునే శక్తి మనకు వుండాలంతే.ఇసుక, మట్టి, గ్రావెల్, రియల్ ఎస్టేట్ వ్యాపారులను యధేచ్ఛగా దోచుకుంటున్నారు. వెంచర్లు వేయాలంటే ఎకరాకు రూ.10 లక్షలు ఎమ్మెల్యేలకు ఇవ్వాలనే నిబంధన రాష్ట్ర వ్యాప్తంగా అనధికారికంగా ఒక రేటు ఖరారైంది. సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌కు సొంత ప్రజాప్రతినిధుల అరాచకాలు కనిపించడంలేదో, వినిపించడం లేదో అర్థం కాని పరిస్థితి. ఈ మాట ఎందుకు అనాల్సి వస్తున్నదంటే%ా% ఎక్కడా అడ్డుకట్ట వేసే పరిస్థితి లేనేలేదు.ఇలాగైతే మళ్లీ అధికారంలోకి ఎలా వస్తామనుకుంటున్నారో ప్రభుత్వ పెద్దలకే తెలియాలి. గతంలో వైసీపీ పాలనే కొంచెం నయమనే పరిస్థితి వుందంటే, ఏ స్థాయిలో దందాలు, దోపిడీలు సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ అనుకూల



మీడియాలో ఏవైనా వ్యతిరేక కథనాలు వస్తే, సీఎం సీరియస్ లాంటి వార్తలు ఆ మధ్య వచ్చేవి. ఇప్పుడవి కూడా లేవు.రాష్ట్రంలో చాలా తక్కువ నియోజకవర్గాల్లో మాత్రమే ప్రజాప్రతినిధుల వేధింపులు లేవనే మాట వినిపిస్తోంది. లిక్కర్, జూదం విచ్చలవిడి అయ్యాయి. సీఎం చంద్రబాబు తన పాలనలో జరగకూడనివి జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదో ఎవరికీ అంతుచిక్కడం లేదు. నిజానికి చంద్రబాబు నుంచి ఇలాంటి పాలనను ఎవరూ ఆశించలేదు, ఊహించలేదు. నాలుగో దఫా సీఎంగా బాధ్యతలు తీసుకున్న తర్వాత, పాలనపై ఆయన పట్టుకోల్పోయిన భావన ప్రతి ఒక్కరిలో కలుగుతోంది.తన కుమారుడు లోకేశ్ అన్నీ చూసుకుంటున్నారనే ధీమాలో వుంటూ, ఇతరేతర విషయాలపై బాబు దృష్టి సారించారా? అనే అనుమానం కలుగుతోంది. లోకేశ్‌కు రెడ్‌బుక్ మొదటి ప్రాధాన్యమైంది. ఆ తర్వాతే మిగిలిన అంశాలు. మొత్తానికి కూటమి పాలన ప్రజలు ఆశించిన స్థాయిలో సాగడం లేదన్నది వాస్తవం.

# జగన్ పిలిచారు...సాయిరెడ్డి వెళ్తున్నారు..నిజమేనా ?



అమరావతి,వైసీపీ పునాది నుంచి ఉన్న నాయకుడు విజయసాయిరెడ్డి. జగన్‌కి ఆయన అత్యంత సన్నిహితుడు. వైఎస్సార్ కుటుంబంలో మూడు తరాల అనుబంధం ఉంది. అటువంటి నాయకుడు సడెన్ గా వైసీపీ నుంచి దూరం అయ్యారు తన పదవులతో పాటు పార్టీకీ రాజీనామా చేశారు. ఇక రాజకీయం చాలు వ్యవసాయమే మేలు అని కూడా ఆయన అనుకున్నారు. అలా వైసీపీకి రాజకీయాలకు దండం పెట్టిన విజయసాయిరెడ్డి ఇపుడు వైసీపీలోకి రీ ఎంట్రీ ఇస్తున్నారా అన్న చర్చ సాగుతోంది.

రాయబారం సాగిందా :

వైసీపీ అధినేత జగన్ కి విజయసాయిరెడ్డికి మధ్య సన్నిహితంగా ఉండే ఒక కీలక నాయకుడు జగన్ వద్ద రాయబారం నడిపారు అని అంటున్నారు పార్టీ కోసం విజయసాయిరెడ్డి ఎంతో చేశారు అని ఆయన చెప్పారట. అంతే కాదు విజయసాయిరెడ్డి పార్టీ నుంచి బయటకు వెళ్ళినా జగన్ మీద పల్లెత్తు మాట అనలేదని ఆయనకు జగన్ పట్ల విధేయత అలాగే ఉందని కూడా చెప్పారట. కొన్ని అనివార్య పరిస్థితుల వల్లనే విజయసాయిరెడ్డి బయటకు వెళ్ళారు తప్ప ఆయన వైసీపీ పట్ల విధేయంగానే ఉంటున్నారని చెప్పుకొచ్చారట.

ఓకే అన్నారా లేక :

అయితే జగన్ ఈ విషయం మీద ఎటూ ఏమీ చెప్పలేదని అంటున్నారు సాధారణంగా ఏ విషయం అయినా వెంటనే తేల్చేసే జగన్ విజయసాయిరెడ్డి విషయంలో మాత్రం ఎందుకో ఆలోచిస్తున్నారని అంటున్నారు దానికి కారణం పార్టీలో చాలా మంది నేతలు విజయసాయిరెడ్డి పట్ల గుర్రుగా ఉన్నారని అంటున్నారు. ఆయన కాకినాడ సీ పోర్టు వ్యవహారం మీద విచారణకు హాజరైనపుడు కొన్ని విషయాలను మీడియా ముఖంగానే చెప్పారని అదే లిక్కర్ స్కాం కేసు ప్రాణం పోసుకోవడానికి కారణం అయిందని ఇపుడు అంతా ఇరుక్కున్నారని వారి ఆగ్రహమని అంటున్నారు. దాంతోనే జగన్ విజయసాయిరెడ్డిని ఆహ్వానించే విషయంలో ఏమీ తేల్చుకోలేకపోతున్నారు అని అంటున్నారు.

ఆయనతో పాటే అంతా :

ఇక వైసీపీకి జగన్ కి విజయసాయిరెడ్డి ఎంతో చేశారని ఆయన పార్టీలో ఉండగా ట్రబుల్ షూటర్ గా వ్యవహరించారని ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేశారని చెబుతారు. ఇపుడు వైసీపీలో అలాంటి ట్రబుల్ షూటర్ అయితే కరవు అయ్యారని అంటున్నారు. అందుకే విజయసాయిరెడ్డిని తిరిగి పార్టీలోకి తీసుకుని రావాలని ఒక వర్గం పట్టుబడుతోంది అని అంటున్నారు. ఈ కీలక సమయంలో పార్టీలో ఆయనను ఉంచుకుంటే మేలు జరుగుతుందని భావిస్తున్నారుట. మొతానికి విజయసాయిరెడ్డి వైసీపీలో రీ ఎంట్రీ ఇస్తే వైసీపీ నుంచి వేరుపడి కూటమిలో చేరి అక్కడ సరైన ప్రాధాన్యత లేకుండా ఉన్న నాయకులు అనేకమంది వైసీపీలోకి వస్తారని ప్రచారం అయితే సాగుతోంది. చూడాలి మరి విజయసాయిరెడ్డి రీ ఎంట్రీ మీద అంతా ఆసక్తిగా చూస్తున్నారు.

# బీఆర్ఎస్ పార్టీలో గువ్వల గుబులు..!



హైదరాబాద్,ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ కి మరో భారీ షాక్ ఇస్తూ.. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సోమవారం తన రాజీనామా లేఖను కేసీఆర్ కు పంపినట్లు ప్రచారం జరుగుతోంది. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అచ్చంపేట నుంచి ఎమ్మెల్యేగా గువ్వల గెలుపొందిన విషయం తెలిసిందే. మొదటి నుంచీ దూకుడు స్వభావమున్న గువ్వల.. పార్టీ అధిష్టానానికి నమ్మిన బంటుగా ఉంటూ వచ్చారు. గత కొన్ని నెలలుగా పార్టీ కార్యక్రమాల్లో నామమాత్రంగా పాల్గొంటూ వచ్చిన గువ్వల అధిష్టానంతో అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రిజర్వుడుగా ఉన్న అచ్చంపేట నియోజకవర్గం జనరల్ గా మారే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గువ్వల రాజీనామా రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

కార్యకర్తగా మొదలుపెట్టి..

తెలంగాణ ఉద్యమ సమయం నుంచి పార్టీలో కీలకపాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బీఆర్ఎస్ ను వీడి బీజేపీలో చేరుతున్నారనే వార్త హల్చల్ చేస్తోంది. 2010లో గువ్వల ఒక సామాన్య కార్యకర్తగా అచ్చంపేట ప్రాంతం నుంచి ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించారు. రెండు పర్యాయాలు అచ్చంపేట శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. అంతకుముందు నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. 2019 ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా గెలిచాక బీఆర్ఎస్ పార్టీ ఆయనకు ప్రభుత్వ విప్ అవకాశం ఇచ్చింది. అయితే 2024 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణ చేతిలో ఓటమి పాలయ్యారు. ఇంతటి రాజకీయ ప్రస్థానం కలిగిన గువ్వల సోమవారం బీఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెబుతూ, పార్టీ అధినేత కేసీఆర్ కు రాజీనామా లేఖ ను అందించారనే చర్చ జరుగుతోంది. అయితే దీనిపై ఇంకా గువ్వల అధికారిక ప్రకటన చేయలేదు.

బీజేపీలో చేరికకు లైన్ క్లియర్..?

రానున్న శాసనసభ స్థానాల సమీకరణనో లేక ఇతర కారణాలో గానీ, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీ పార్టీలో చేరేందుకు లైన్ క్లియర్ చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొద్ది రోజులుగా బాలరాజు నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో ఫోన్ లో మాట్లాడుతూ తాను పార్టీ మారుతున్నానని, ఎవరైనా వచ్చే వాళ్లు ఉంటే తనతో రావచ్చని ఆహ్వానించారని సమాచారం. అయితే ఆయన ఆశించిన స్థాయిలో కిందిస్థాయి నేతలు అతనితో వెళ్లేందుకు సానుకూలంగా లేరనే టాక్ వినిపిస్తోంది.

ముందు మనమే బీజేపీలో చేరితే సరిపోతుంది కదా..!

'అన్నా నమస్తే.. బీజేపీలోకి పోతున్నారని వార్తలు వస్తున్నాయి.. నిజమేనా?' అని అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన ఒక కార్యకర్త మాజీ ఎమ్మెల్యే గువ్వలను ఫోన్ లో అడగగా.. 'కరెక్టే తమ్మీ.. పొద్దున్నే రాజీనామా చేసిన.. బీఆర్ఎస్ బీజేపీ తో పొత్తు అంటున్నారు. విలీనం చేయాలని చూస్తున్నారు.. అప్పటిదాకా మనం ఆగితే పరిస్థితులు మనకు అనుకూలంగా ఉండవు.. ముందే మనం చేరితే సరిపోతుంది కదా' అని సమాధానం ఇచ్చిన ఆడియో ఒకటి వైరల్ గా మారింది. చూడాలి మరి ఆయన ఎటువైపు చేరుతారో..!ఇదిలా ఉండగా.. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయింగా.. ప్రస్తుతం బంతి స్పీకర్ కోర్టులో ఉంది. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీం చెప్పింది. అంతేకాకుండా పలువురు కీలక నేతలు సైతం ఇతర పార్టీల్లోకి వెళ్లారు. ఇప్పుడు గువ్వల బాలరాజు సైతం ఆ లిస్ట్‌లో చేరారు. అయితే ఎవరు పోయిన పార్టీకి వచ్చిన నష్టం ఏమిలేదని గతంలో కేటీఆర్ వ్యాఖ్యానించారు. తాజాగా గువ్వల రాజీనామాపై ఎలా స్పందిస్తారో చూడాలి.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు మరొకరు బలి

హైదరాబాద్,ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి అప్పులు తీర్చలేక పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బెట్టింగ్ గేమ్స్ ఆడకుండా ఉండలేక.. అప్పులు తీర్చలేక ప్రాణాలను తీసుకుంటున్నట్లు మృతుడు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన నరేశ్.. భార్య కీర్తి, కుమార్తె భవ్యతో కలిసి వనస్థలిపురంలోని ఓ కాలనీలో నివాసముంటున్నారు.

# ఆరు లైన్ల రహదారిగా విజయవాడ హైవే

న్యూఢిల్లీ, మల్కాపూర్ నుంచి విజయవాడ వరకు రహదారిని 4 వరుసల నుంచి 6 వరుసలుగా విస్తరించడంతో పాటు- సర్వీస్ రోడ్లను నిర్మించాలని కేంద్ర గడ్కరీని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికోరారు. కేంద్ర మంత్రి గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశ మయ్యారు. వచ్చే వారం ప్రధాన మంత్రితో సమావేశం అవనున్నారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న జాతీయ రహదారుల మంజూరీపై గడ్కరీతో సుదీర్ఘంగా చర్చించారు. మంత్రితో పాటు తెలంగాణ ఎంపీలు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం గురించి ప్రయత్నాలు చేస్తున్నాం.. ప్లాన్స్ జరుగుతున్నాయన్నారు. పటౌడీ హౌస్ లో రెండు నెలల్లో పనులు మొదలు పెట్టాలని ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో అనుమతుల కోసం కొంత ఆలస్యం అవుతోందన్నారు. రాజగోపాల్ రెడ్డి ఎపిసోడ్ పై మంత్రి స్పందించారు. నేను మా సోదరుడికి మంత్రి పదవి ఇప్పించే స్టేజ్ లో లేను. కేంద్ర పెద్దలు మాటిచ్చిన విషయం నాకు తెలియదు. నా చేతుల్లో ఏం లేదు. అధిష్టానం, ముఖ్యమంత్రి మంత్రి పదవుల విషయంలో నిర్ణయాలు తీసుకుంటారు. నేను ఢిల్లీకి రాలేదు. మంత్రి పదవి అడగలేదు అని స్పష్టం చేశారు. తెలుగు సినీ పరిశ్రమలో కార్మికుల 30శాతం వేతన పెంపు డిమాండ్‌తో జరుగుతున్న సమ్మె వివాదంపై కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రముఖ నిర్మాత దిల్ రాజుకు బాధ్యతలు



అప్పగించినట్లు- ఆయన తెలిపారు. కార్మికుల డిమాండ్లపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. కార్మికులకు జీతాలు పెంచాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్‌లో బతకాలంటే జీతాలు పెరగాలి. ఢిల్లీ పర్యటన తర్వాత నేను కార్మికులతో నేరుగా మాట్లాడతాను. ఈ అంశాలన్నిటినీ దిల్ రాజుకు అప్పగించాము. ఆయన ప్రొడ్యూసర్ కౌన్సిల్‌తో చర్చలు జరుపుతున్నారుని వెల్లడించారు. ఆయన మరింత మాట్లాడుతూ, 'పాన్ ఇండియా సినిమాలు తీస్తున్నారు. టికెట్ ధరలు పెంచేందుకు మేము అనుమతులు ఇస్తున్నాము. కాబట్టి, కార్మికులు అడుగుతున్న డిమాండ్లపై చర్చించి, నిర్మాతలు తగిన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

# బండి సంజయ్‌కు మరోమారు సిట్ నోటీసులు



హైదరాబాద్,తెలంగాణ పాలిటిక్స్‌లో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ సిట్ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆగస్ట్ 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ కేసులో సాక్షిగా వాంగ్మూలం ఇవ్వాలని సిట్ కోరింది. ఈ మేరకు విచారణకు హాజరు అవుతానని సిట్‌కు బండి సంజయ్ రిప్లై ఇచ్చినట్లు- తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని పలుమార్లు బండి సంజయ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో ఆయన పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో దూకుడు పెంచిన సిట్ ఇప్పటికే పలువురు రాజకీయ నాయకుల స్టే-టె-÷-మంట్లను రికార్డ్ చేసింది. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఫహీం ఖురేషి తదితర నేతల వాంగ్మూలాలను సిట్ నమోదు చేసింది. ఇందులో భాగంగా గతంలోనే బండి సంజయ్‌కు కూడా సిట్ నోటీ-సులు జారీ చేసింది. ముందస్తు షెడ్యూల్ వల్ల బండి సంజయ్ కు సిట్ విచారణకు హాజరు కాలేదు. దీంతో ఆగస్ట్ 8వ తేదీన విచారణకు హాజరు కావాలని తాజాగా సిట్ మరోసారి నోటీస్ జారీ చేసింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com